## క్లుప్తంగా

### ఎమ్మెల్యే కొఠారును కలిసిన జీపీ జగన్నాథరెడ్డి



ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరికి పూల మొక్క ఇస్తున్న పీపీ జగన్నాథరెడ్డి

**దెందులూరు:** ఏలూరు జిల్లా మెయిన్ కోర్టు జీపీగా నియమితులైన బి.జగన్నాథరెడ్డి బుధవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. జీపీని ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో నాయకులు మేకా లక్ష్మణరావు, పాలడుగు సత్యనారాయణ, ముఖర్జీ ఉన్నారు.

### ప్రజలకు నిత్యసహాయ మాత దీవెనలు

**దెందులూరు:** పరిశుద్ధ నిత్యసహాయ మాత దీవెనలు అందరికీ ఉంటాయని ఫాదర్లు పేర్కొన్నారు. బుధవారం పోతునూరు ఆర్‌సీఎం చర్చిలో ఫాదర్ పి.డేవిడ్ అధ్యక్షతన ఫాదర్ రాజు, డేవిడ్ మరో ఆరుగురు ఫాదర్లు దివ్యబలిపూజ అర్పించారు. కార్యక్రమంలో ఆర్‌సీఎం సంఘపెద్దలు, మరియదళ సభ్యులు, ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామంలోని అన్ని విభాగాల పెద్దలు, ఉపదేశీయులు పాల్గొన్నారు.

### ముప్పర్తిపాడులో హిందూ ధర్మప్రచారం



హిందూ ధర్మంపై మాట్లాడుతున్న ప్రబోధ సేవాసమితి సభ్యుడు

**గణపవరం:** యోగి వేమన జయంతిని పురస్కరించుకుని గణపవరం మండలం ముప్పర్తిపాడు గ్రామంలో బుధవారం ప్రబోధ సేవాసమితి, త్రైత సిద్ధాంత హిందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో హిందూ ధర్మప్రచారం చేశారు. త్రైత సిద్ధాంత భగవద్గీత, దాని అనుబంధ గ్రంథాలు చదివి స్వామివారి ప్రసంగాలు విని ఆత్మజ్ఞానం తెలుసుకుని జ్ఞానులుగా మారాలని వారు అన్నారు. వేమన పద్యాల జ్ఞానం భగవద్గీత జ్ఞానం రెండు ఒకటేనన్నారు. వేమన తత్వ, కృష్ణ తత్వం కూడా ఒకటేనని చెప్పారు. కార్యక్రమంలో ఉదయకుమార్, నాగేశ్వరరావు, రమేష్, హనుమంతరావు, వాసుదేవ, రామకృష్ణ, సత్యనారాయణ, తారకేశ్వరి, సాయిశ్రీ, యశోద తదితరులు పాల్గొన్నారు.

### ఓటరు చైతన్య మాలిక కరపత్రం విడుదల



ఓటరు చైతన్య మాలిక కరపత్రం విడుదల చేస్తున్న జెడ్పీసీఈఓ రవికుమార్

**ఏలూరు (టూటౌన్):** జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆల్‌ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మెండెం సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఓటరు చైతన్య మాలిక కరపత్రాన్ని జెడ్పీసీఈఓ ఆర్‌వీఎస్ఆర్ రవికుమార్ విడుదల చేశారు. ప్రతి ఒక్కరూ రాజ్యాంగం కల్పించిన ఓటును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సంతోష్ కుమార్ మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కుల, మతాలకు అతీతంగా, రాజ్యాంగ బద్ధంగా ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించినట్టు చెప్పారు. ఇటీవల రాష్ట్ర గవర్నర్ విశ్వభూషణ్ చేతుల మీదుగా బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీసెస్ అవార్డు స్వీకరించిన జెడ్పీసీఈఓ రవికుమార్‌కు అభినందనలు తెలిపారు. ఏఐఏవైఎస్ నాయకులు కొరబండి బాబూరావు, పల్లా యేసేబు, ఎస్.నాగార్జున, పి.కిరణ్ కుమార్, పి.వినీష్ పాల్గొన్నారు.

### శనివారపుపేట విద్యార్థినులకు బహుమతులు



బహుమతులు అందుకున్న విద్యార్థినులు

**ఏలూరు రూరల్:** శనివారపుపేట జెడ్పీ స్కూల్ విద్యార్థినులు పలు పోటీల్లో విజయం సాధించి నగదు బహుమతి, ప్రశంసాపత్రం అందుకున్నారని హెచ్ఎం ఎ.సర్వేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. జాతీయ బాలికల దినోత్సవాన్ని పురష్కరించుకుని డీఎంహెచ్ఓ శాఖ నిర్వహించిన చిత్రలేఖనం విభాగంలో తొమ్మిదో తరగతి విద్యార్థినులు సీహెచ్ ప్రణవి ద్వితీయ బహుమతి రూ.5 వేలు, డి.ప్రియాంక తృతీయ బహుమతి రూ.3 వేలు నగదు అందుకున్నట్టు పేర్కొన్నారు. వ్యాసరచనలో ఎస్కే నూర్‌సుమియా ప్రథమ బహుమతి రూ.10 వేలు, వక్తృత్వ పోటీల్లో 10వ తరగతి విద్యార్థిని కె.భవ్య తృతీయ బహుమతి రూ.3 వేలు అందుకున్నారని తెలిపారు. విజేతలను ఉపాధ్యాయులు అభినందించారు.

# అర్హతే ప్రామాణికంగా పథకాల అమలు



బువ్వనపల్లిలో పథకాల లబ్ధి బుక్‌లెట్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు



గుడివాకలంకలో మహిళకు పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

**నిడమర్రు:** కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తోన్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. బుధవారం 123వ రోజు బువ్వనపల్లి గ్రామ సచివాలయం–2 పరిధిలో విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి పార్టీ నేత సంకు నాగేషు కార్యాలయం మీదుగా జగనన్న కాలనీ వరకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసుబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తోన్న సంక్షేమ పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు నిండుతున్నాయన్నారు. పేదరికమే ప్రమాణికంగా తీసు

**ఎమ్మెల్యే వాసుబాబు**

కుని రాష్ట్ర ప్రభుత్వం నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోనే సంక్షేమ ఫలాలు అందిస్తోందని చెప్పారు. సుమారు 150 గడపలను సందర్శించి, వారికి అందిన పథకాల లబ్ధిని ఎమ్మెల్యే వివరించారు. కాలనీలో నెలకొన్న పలు సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సచివాలయం సిబ్బందిని ఆదేశించారు. తొలుత పార్టీ నేత సంకు నాగేషు ఆధ్వర్యంలో జగనన్న కాలనీ మహిళలు ఎమ్మెల్యే వాసుబాబుకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో పార్టీ మండల బాధ్యుడు పుప్పాల కన్నబాబు, జిల్లా వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు వెజ్జు వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ సంకు సత్యకుమార్, సర్పంచ్ కిలారి సత్యవతి రవిబాబు, ఉపసర్పంచ్ వెల్లంకి నరేష్, వైస్ ఎంపీపీ సమయం వీరరాఘవులు, పార్టీ గ్రామ అధ్యక్షుడు కాన్వెంట్ శ్రీను, సంకు శేషు సర్పంచ్‌లు పుప్పాల మెహర్‌కుమార్, పాట్నూరి ఉమామహేశ్వరరావు, ముగ్గళ్ల యాకోబు, మాజీ వైస్ ఎంపీపీ నౌడు అచ్యుతరామారావు పాల్గొన్నారు.

**పథకాలతో పేదలకు మేలు**

**ఏలూరు రూరల్:** సంక్షేమ పథకాలతో పేదలకు మేలు చేకూరుతోందని దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. గుడివాకలంకలో మంగళవారం రోడ్డు శంకుస్థాపన కార్యక్రమం అనంతరం రాత్రి అక్కడే బస చేసిన ఎమ్మెల్యే బుధవారం గ్రామంలోనే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 7 నుంచి ఇంటింటికీ వెళ్లి పథకాల అమలుపై లబ్ధిదారులను ఆరా తీశారు. విద్యాభివృద్ధికి నాడు – నేడు, అమ్మఒడి, కుల వృత్తుల వారికి జగన్న తోడు తదితర పథకాలను అమలు చేస్తున్నారని వివరించారు. ప్రజల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ పెన్మత్స శ్రీనివాసరాజు, మాజీ ఎంపీపీ జయమంగళ రామారావు, పార్టీ గ్రామాధ్యక్షుడు బలే బలరామయ్య, గ్రామ ఉపసర్పంచ్ రుక్మనంధమహరాజ్, కొల్లేరు నాయకులు పల్లెం ప్రసాద్, ముంగర సంజీవ్‌కుమార్, తేరా ఆనంద్, మండల కొండలరావు పాల్గొన్నారు.

### ఏఎంసీలో నిమ్మకాయల గ్రేడింగ్ మెషీన్ ప్రారంభం



లక్ష్మీపురం మార్కెట్ యార్డులో నిమ్మకాయల గ్రేడింగ్‌ను పరిశీలిస్తున్న అబ్బయ్య చౌదరి

**పెదవేగి:** నిమ్మ ఉత్పత్తులను అధునాతన టెక్నాలజీ మెషీన్ల ద్వారా గ్రేడింగ్ చేయడం ద్వారా రైతులు గిట్టుబాటు ధర పొందవచ్చని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అన్నారు. పెదవేగి మండలం లక్ష్మీపురంలో ఉన్న దెందులూరు మార్కెట్ యార్డ్‌లో రైతుల సౌకర్యార్థం మార్కెట్ కమిటీ కొనుగోలు చేసిన నిమ్మకాయల గ్రేడింగ్ మెషీన్‌ను ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించి మాట్లాడారు. నిమ్మ ఉత్పత్తుల ఎగుమతిలో దెందులూరు మార్కెట్ కమిటీ ప్రథమ స్థానంలో ఉందన్నారు. రానున్న రోజుల్లో దెందులూరు మార్కెట్ కమిటీలో రైతుల ఉత్పత్తుల నిల్వలకు కోల్డ్ స్టోరేజీల ఏర్పాటు కూడా చేయనున్నట్టు చెప్పారు. మార్కెట్ కమిటీ ద్వారా రైతులకు మరిన్ని సౌకర్యాల కల్పనకు కృషిచేస్తానని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ తాతా రమ్య, ఏఎంసీ చైర్మన్ మేకా లక్ష్మణరావు, సొసైటీ చైర్‌పర్సన్ పెనుమాక వెంకట సుబ్బారావు, పెదవేగి మండల సచివాలయాల కన్వీనర్ కేసిన సతీష్, డీసీసీబీ డైరెక్టర్ తాతా సత్యనారాయణ, కొనకళ్ల వెంకన్న, రైతులు ఆలపాటి రంగారావు తదితరులు పాల్గొన్నారు.

## సచివాలయాల మండల బాధ్యుడిగా నౌడు



నౌడుకు నియమక పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు

**నిడమర్రు:** నిడమర్రు మండల జగనన్న సచివాలయాల (జేసీఎస్) మండల బాధ్యుడిగా సిద్ధాపురం గ్రామానికి చెందిన మాజీ వైస్ ఎంపీపీ నౌడు వెంకట అచ్యుతరామారావును వైఎస్సార్ సీపీ నియమించింది. ఆయనకు బుధవారం బువ్వనపల్లిలోని సంకు నాగేషు కార్యాలయంలో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు నియామక పత్రాన్ని అందించారు. తనపై నమ్మకం ఉంచి మండల బాధ్యతలు అప్పగించినందుకు ఎమ్మెల్యే వాసుబాబుకు నౌడు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని 14 గ్రామ సచివాలయాల పార్టీ కన్వీనర్లు, సచివాలయ సిబ్బందిని సమన్వయం చేస్తూ ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించేలా కృషి చేస్తానని అన్నారు. నౌడును పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ శ్రేణులు ఘనంగా సత్కరించి, అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర సూర్యబలిజ కార్పొరేషన్ చైర్మన్ శెట్టి అనంతలక్ష్మి, మండల బాధ్యులు పుప్పాల కన్నబాబు, జిల్లా వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు వెజ్జు వెంకటేశ్వరరావు, మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షులు పుప్పాల మెహర్‌కుమార్ తదితరులున్నారు.

## యూటీఎఫ్ అధ్యక్షుడిగా రామకృష్ణ



ప్రమాణ స్వీకారం చేసిన యూటీఎఫ్ మండల నూతన కార్యవర్గం

**నిడమర్రు:** యూటీఎఫ్ నిడమర్రు మండల శాఖ నూతన అధ్యక్షుడిగా ఏడోసారి అడవికొలను గ్రామానికి చెందిన మండల రామకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పీవీ నరసింహారావు ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం నిడమర్రులో నిర్వహించిన యూటీఎఫ్ మండల శాఖ సర్వసభ్య సమావేశంలో 2023–24 సంవత్సరానికి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ఏఎస్ శరత్ చంద్ర, ఉపాధ్యక్షులుగా జల్లా యేసు, సీహెచ్‌బీఎల్ కుమారి, ప్రధాన కార్యదర్శిగా షేక్ మౌలాలి ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నేషనల్ ఇంటిగ్రిటి స్టేట్ అవార్డు పొందిన పత్తేపురం సైన్స్ టీచర్ కె.సుబ్బరాజును సభ్యులు ఘనంగా సత్కరించారు. సీపీఎస్ జిల్లా కన్వీనర్ కె.కమల్‌కుమార్ తదితరులున్నారు.

# ఓటే వజ్రాయుధం



భీమడోలులో ఓటర్లను సత్కరిస్తున్న అధికారులు




దెందులూరులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

**భీమడోలు:** ఓటు హక్కు వజ్రాయుధమని తహసీల్దార్ షంషుద్దీన్, ఎంపీడీఓ జీఎల్ఎస్‌వీ రాఘవన్‌లు పేర్కొన్నారు. 12వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం 53 పోలింగ్ బూత్‌ల వారీగా అవగాహన సదస్సులను నిర్వహించారు. ఓటర్లచే ప్రతిజ్ఞ చేయించారు. రంగవల్లుల పోటీలను నిర్వహించారు. భీమడోలు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ పాము సునీతా మాన్‌సింగ్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో తహసీల్దార్ షంషుద్దీన్, ఎంపీడీఓ రాఘవన్‌లు మాట్లాడారు. మండలంలో 51,430 మంది ఓటర్లు ఉన్నాయని, వీరంతా ఓటును వినియోగించుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న 716 మందికి ఓటు గుర్తింపు కార్డులను అందిస్తామన్నారు. ఈ సందర్భంగా సీనియర్ ఓటర్లను దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. పోలసానిపల్లి వీఆర్వో డి.సింహాచలం ఆధ్వర్యంలో ప్రాథమిక పాఠశాలలు, గురుకుల బాలికల కళాశాల్లో బూత్ లెవెల్ అధికారులు, సచివాలయాల సిబ్బంది, యువతీ యువకులతో ప్రతిజ్ఞ చేయించారు. ప్రిన్సిపాల్ పద్మావతి, గ్రామ కార్యదర్శి ఎస్.ఠాగూర్, వీఆర్వో వెజ్జు వినయ్, మార్కేండేయులు తదతరులు పాల్గొన్నారు.

**ఓటు హక్కుపై అవగాహన**

**గణపవరం:** ఓటు వజ్రాయుధం లాంటిదని, అర్హులంతా ఓటు హక్కు పొందాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ పి.నిర్మలకుమారి అన్నారు. బుధవారం డిగ్రీ కాలేజీలో జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. కెరీర్‌గైడెన్స్ కార్యక్రమం సెట్వెల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సెట్వెల్ మేనేజర్ సత్యనారాయణ, న్యాక్ కోఆర్డినేటర్ టి.అక్కిరాజు, పీడీ విజయకుమార్, మహిళా సాధికారత కన్వీనర్ స్వరూపారాణి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డీవీవీ చిన సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

**అర్హులంతా ఓటు హక్కు పొందాలి**

**దెందులూరు:** 18 ఏళ్లు నిండిన వారంతా ఓటు హక్కును పొందాలని దెందులూరు నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్, సోషల్ వెల్ఫేర్ ఎంపవర్‌మెంట్ ఆఫీసర్ మధుసూదనరావు సూచించారు. బుధవారం స్థానిక తహసీల్దార్ ఎన్‌వీ నాంచారయ్య, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ గాయత్రి ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు వేసిన ముగ్గులను పరిశీలించారు. వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ ఓటర్లను సన్మానించారు. కార్యక్రమంలో వీఆర్వోలు సాల్మన్, అనిరుధ్, బీఎల్ఓలు, డీఆర్‌డీ నర్సింగ్ విద్యార్థినులు పాల్గొన్నారు.

**ఓటరుగా నమోదుకండి**

**పెదపాడు:** అర్హులంతా ఓటును నమోదు చేసుకోవాలని తహసీల్దార్ జి.విజయకుమార్ రాజు అన్నారు. బుధవారం పెదపాడు కొక్కిరపాడు గ్రామాల్లో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సీనియర్ ఓటర్లను శాలువాలు కప్పి పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వీఆర్వో కె.నటరాజన్‌దాసు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జి.సుబ్రహ్మణ్యేశ్వరరావు, గ్రామసచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**నారాయణపురంలో..**

**ఉంగుటూరు:** జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నారాయణపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటు ప్రాధాన్యతను వివరించారు. ఓటు హక్కును సద్వినియోగం చేయసుకోవాలని తహసీల్దార్ వెంకట రమణ సూచించారు. సీనియర్ ఓటర్లను సత్కరించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీఓ ప్రేమాన్విత, ప్రిన్సిపాల్ విశ్వేశ్వరరావు, ఉపాధ్యాయులు రాము, బాబూరావు, ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, ఎలక్షన్ డీటీ తదితరులు పాల్గొన్నారు.

**ఘనంగా ఓటర్ల దినోత్సవం**

**ఏలూరు(మెట్రో):** అర్హులంతా ఓటరుగా నమోదు కావాలని జిల్లా రెవెన్యూ అధికారి ఏవీఎస్ఎస్ మూర్తి అన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. సచివాలయ సిబ్బంది, బీఎల్ఓలు, విద్యార్థులతో ఓటరు ప్రతిజ్ఞ చేశారు. ఇటీవల వక్తృత్వ పోటీల్లో విజేతలయిన బాలబాలికలకు ప్రశంస పత్రాలను అందజేశారు. సీనియర్ సిటిజన్లు జె.కుటుంబరావు, ఆర్.రాజశేఖర్, పి.సూరమ్మలను శాలువ, పూల దండలతో సత్కరించారు. యువతకు ఓటరు గుర్తింపు కార్డులను అందజేశారు.

# వేంపాడు – వట్లూరు రహదారికి శంకుస్థాపన



వేంపాడు - వట్లూరు రహదారికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

**పెదపాడు:** దెందులూరు నియోజకవర్గంలోని రూ.300 కోట్లతో రహదారుల అభివృద్ధి చేశామని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. జిల్లా పరిషత్, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.70 లక్షల అంచనా వ్యయంతో చేపట్టే పెదపాడు మండలం వేంపాడు –వట్లూరు తారు రోడ్డు నిర్మాణానికి ఆయన బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ రెండున్నర కిలో మీటర్ల మేర నిర్మించే బీటీ రహదారి నిర్మాణం ఫిబ్రవరి 15తేదీలోగా పూర్తి చేయాలని కాంట్రాక్టరును ఆదేశించారు. కొక్కిరపాడు గ్రామంలో రహదారులన్నీ అభివృద్ధి చేశామన్నారు. సచివాలయం, హెల్త్ సెంటర్, 200 మందికి పైగా లబ్ధిదారులకు 5.50 ఎకరాలు కొని ఇళ్ల స్థలాలుగా పంపిణీ చేశామని చెప్పారు. గ్రామంలో ఓహెచ్ఆర్ ట్యాంకు నిర్మిస్తామన్నారు. స్కూళ్లను అభివృద్ధి చేశామని, 2.50 కిలో మీటర్లు సీసీ రోడ్లు నిర్మించామని, సచివాలయ భవనాలు నిర్మించామని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ మరీదు రెడ్డియ్య, ఎంపీటీసీ వీరంకి బుజ్జి, ఎంపీపీ బత్తుల రత్నకుమారి, పార్టీ పెదపాడు మండల కన్వీనర్ అప్పన ప్రసాద్, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు ఆళ్ల సతీష్‌చౌదరి, ఏఎంసీ చైర్మన్ మేకా లక్ష్మణరావు, వివిధ గ్రామాల ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

### మహిళా శిశు సంక్షేమాభివృద్ధికి కృషి చేయాలి



కలక్టరేట్‌లో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న సూపర్‌వైజర్లు

**ఏలూరు (మెట్రో):** మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఏలూరు జోన్ పరిధిలో నియమితులైన 86 మంది గ్రేడ్–2 సూపర్ వైజర్లు జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లో బుధవారం తనను కలిసిన వారిని కలెక్టర్ అభినందించారు. మహిళా శిశు సంక్షేమాభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏలూరు జోన్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ కె.ఉమారాణి, ప్రాజెక్ట్ డైరెక్టర్ కేపీవీఎల్ పద్మావతి, విస్తరణాధికారి వి.మల్లిక, కార్యాలయ సిబ్బంది, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

### బ్యాంకు ఉద్యోగుల నిరసన

**ఏలూరు (టూటౌన్):** ఈ నెల 30, 31 తేదీల్లో అఖిల భారత బ్యాంక్ ఉద్యోగుల సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించే దేశవ్యాప్త సమ్మెకు సన్నాహకంగా బుధవారం లంచ్ అవర్‌లో ఏలూరులోని పలు బ్యాంకుల వద్ద ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. రిటైర్ ఉద్యోగుల పెన్షన్ సవరణ, పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ, వారానికి ఐదు రోజుల పని దినాలు, సిబ్బంది తక్షణ నియామకం, వేతన సవరణ వంటి సమస్యల పరిష్కారానికి సమ్మె చేయనున్నట్లు ఉద్యోగ సంఘం నాయకులు తెలిపారు. నిరసన కార్యక్రమాల్లో ఉద్యోగ సంఘాల నాయకులు దుగ్గిరాల శ్రీనివాస్, సుంకర శ్రీనివాసరావు, చంద్రశేఖర్, కిషోర్ పాల్గొన్నారు.

## దేవుని యందు విశ్వాసంతో జీవించాలి



కన్యస్త్రీలను సత్కరిస్తున్న ఫాదర్లు, విచారణ కర్తలు

**భీమడోలు:** ప్రతి ఒక్కరూ దేవుని యందు విశ్వాసంతో జీవించాలని కేరళకు చెందిన ప్రముఖ గురువు ఫాదర్ పాల్ పుదువా అన్నారు. భీమడోలు ఆర్‌సీఎం చర్చిలో మంగళవారం రాత్రి భీమడోలు నిర్మల కన్యస్త్రీల సంస్థకు చెందిన నలుగురు కన్యస్త్రీల జూబ్లీ మహోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఫాదర్ పాల్ పుదువా దివ్య పూజా బలిని సమర్పించారు. సుదీర్ఘకాలం దేవుని సేవలో ఉన్న సిస్టర్స్ ఎవలీనా ఎడక్కర, అలెక్స్, వినీత, జెర్రీలను దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కేరళకు చెందిన గురువులు, కన్యస్త్రీలు, ఆంధ్ర, తెలంగాణ రీజనల్ సుపీరియల్ ఫాదర్ జోబి కణ్ణంపల్లి, భీమడోలు విచారణ కర్త ఫాదర్ నెల్సన్, సుపీరియల్ ఫాదర్ జోబి, భీమడోలు నిర్మల సంస్థ సుపీరియల్ సిస్టర్ మోక్ష, పరిపాలనా సిస్టర్ లీసీ, సిస్టర్ విక్టోరియా, డీపాల్ విన్సెంట్ సొసైటీ భ్యులు, మరియ దళ సభ్యులు, ఆరోగ్య మాతా హాస్పిటల్ సిబ్బంది, విశ్వాసులు పాల్గొన్నారు.

## విజయమే లక్ష్యంగా పనిచేద్దాం



గోపన్నపాలెంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు నాని

**దెందులూరు:** వైఎస్సార్‌సీపీ నిబంధనలకు లోబడి వచ్చే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా అంకితభావంతో పనిచేయాలని వైఎస్సార్‌సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని సూచించారు. బుధవారం గోపన్నపాలెంలో గ్రామ సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి కుమార్, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు వీరంకి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జగనన్న సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల సమావేశంలో నాని మాట్లాడారు. సమష్టి కృషితోనే లక్ష్యాలను సాధించగలమని అన్నారు. సమావేశంలో ఉప సర్పంచ్ ఏనుగు హేమసాగర్, ఎంపీటీసీలు ఏనుగు అంజలి ప్రసాద్, సువ్వా ప్రభుదాసు, నాయకులు వరికూటి కోటేశ్వరరావు, కొండేటి గంగాధరబాబు, మాగంటి కృష్ణమోహన్, మోర్ల సుబ్బా రావు, తోట పద్మారావు, వార్డుమెంబర్లు ఉన్నారు.

## బాలికా సంరక్షణ అందరి బాధ్యత

**ఏలూరు (టూటౌన్):** బాలికా సంరక్షణతో భవితకు బాట వేయాలని బాల వికాస్ భారతి ఫౌండర్ ప్రెసిడెంట్ కట్టా సత్యనారాయణ అన్నారు. స్థానిక ఏవీఆర్‌విజ్ఞాన కేంద్రంలో బాల వికాస్ భారతి, ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ బాలల రక్షణ సంక్షేమానికి కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా బాలికలకు పౌష్టికాహార ప్యాకెట్స్ అందజేశారు. కార్యక్రమంలో మానవత నాయకులు ఆలపాటి నాగేశ్వరరావు, న్యాయవాది కూనకృష్ణారావు, మాతృదేవోభవ సంస్థ అధ్యక్షుడు సత్యనారాయణ, పి.రత్నాకర్‌రావు, మేతర అజయ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

### యర్రమిల్లిపాడు సర్పంచ్ తమ్మినకు అవార్డు



సర్పంచ్ తమ్మిన శ్రీనివాసరావు

**ఉంగుటూరు:** మండలంలోని యర్రమిల్లిపాడు గ్రామసర్పంచ్ తమ్మిన శ్రీనివాసరావు జిల్లా స్థాయి ఉత్తమ సర్పంచ్ అవార్డుకు ఎంపికయ్యారు. ఆయన గురువారం ఏలూరు పోలీసు గ్రౌండ్సులో నిర్వహించే రిపబ్లిక్ దినోత్సవ వేడుకలో ప్రశంసాపత్రం, అవార్డు అందుకోనున్నారు. ప్రభుత్వానికి తమ్మిన తన సొంత స్థలం 20 సెంట్లు ఉదారంగా అందజేశారు. ఈ స్థలంలో రూ.1 కోటీ 6 లక్షల వ్యయంతో సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటరు భవనాలను నిర్మించారు. ప్రభుత్వం రూ.79 లక్షలు ఖర్చుచేయగా, మిగిలిన మొత్తం సర్పంచ్ తమ్మిన తన సొంత సొమ్ము ఖర్చు చేశారు. మరో నాలుగు సెంట్ల భూమిని పాలు ఉత్పత్తి భవన నిర్మాణానికి ఆయన అందజేశారు. జిల్లా, మండల పరిషత్ నిధులతో గ్రామంలో శ్మశాన వాటికకు ప్రహరీ, షెడ్డు నిర్మించారు. సర్పంచ్ తమ్మిన ఎంపీ కోటగిరి శ్రీధర్, ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబుల మన్ననలను అందుకున్నారు. తోటి సర్పంచలు ప్రజాప్రతినిధులు శ్రీనివసరావును అభినందిస్తున్నారు.

### 11 మందికి జరిమానా

**భీమడోలు:** బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న 11 మందిని అరెస్ట్ చేసి బుధవారం స్థానిక కోర్టులో హాజరుపర్చగా జడ్జి రిషిత్ ఆదిత్య జరిమానా విధించినట్లు ఎస్సై చావా సురేష్‌కుమార్ తెలిపారు. రెండు రోజులుగా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి ప్రజలకు విసుగుపుట్టిస్తున్న వారిని పోలీసు తనిఖీల్లో అదుపులోకి తీసుకున్నట్టు చెప్పారు. వీరికి రూ.200 చొప్పున జరిమానా విధించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

దెందులూరు, ఉంగుటూరు
9912220559
90102 23729
Office mail : tpgadvt@gmail.com